బాబు మోసాలను ఎండగడతాం

- మోసానికి నిలువెత్తు రూపం చంద్రబాబు
- హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం
- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు


'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ స్కాన్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, పార్టీ నేతలు, కార్పొరేటర్లు

తాటిచెట్లపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను వంచిస్తున్నారని, ఆయన మోసాలను ప్రజల్లో ఎండగడతామని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం అక్కయ్యపాలెం షాదీఖానాలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' నియోజకవర్గ స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ అని, మోసానికి నిలువెత్తు రూపం చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా చంద్రబాబు, కూటమి పాలనలో చోటుచేసుకున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమే తమ ఉద్దేశమని తెలిపారు. త్వరలో ప్రతి వార్డులోనూ ఈ కార్యక్రమం నిర్వహించి చంద్రబాబు పాలనలో జరిగిన, జరుగుతున్న మోసాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు.

2014లో రాష్ట్ర విభజన సమయంలో జరిగిన ఎన్నికల్లో అనుభవజ్ఞుడని ప్రజలు చంద్రబాబుకు అధికారం, అవకాశం కల్పిస్తే ప్రజలను మోసం చేసి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని గుర్తుచేశారు. అదే సమయంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న వైఎస్ జగన్ టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అనేక పోరాటాలు చేసినా.. స్పందించక పోవడంతో ప్రజల్లో ధైర్యం నింపేందుకు, భరోసాగా ఉండేందుకు రాష్ట్రంలో 3,648 కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు. ప్రజల వద్ద నుంచి అనేక వినతులు స్వీకరించి, వాటిని అధ్యయనం చేసి అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా నవరత్నాలు పథకాలు రూపొందించారని చెప్పారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే నవరత్నాలతోపాటు మరెన్నో సంక్షేమ పథకాలనుఅమలు చేసి ప్రజారంజక పాలన అందించారని గుర్తుచేశారు. 2019–2024 వరకు ఎన్నో ప్రతికూలతలు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అద్భుతమైన పరిపాలన చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించారన్నారు.

హామీలపై ప్రశ్నిస్తే తప్పుడు కేసులు

గత ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి సూపర్‌సిక్స్ పేరుతో అమలు కాని హామీలిచ్చి ప్రజలందరినీ నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చారని కె.కె.రాజు అన్నారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ కూడా అమలు చేయకుండా ఏడాది కాలం గడిపేశారని, దీనిని ప్రశ్నిస్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ పరిపాలన సాగిస్తోందని, తప్పుడు కేసులు, అరాచకాలతో ప్రశ్నించే ప్రతి గొంతును నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ విషయాలను జనంలోకి తీసుకెళ్లి ప్రజల పక్షాన నిలబడటమే వైఎస్ జగన్ ఉద్దేశమన్నారు.

చంద్రబాబు మాటలకు నో ష్యూరిటీ, గ్యారెంటీ

ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు మాట్లాడుతూ చంద్రబాబు మోసగాడని నేడు కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదని, ఆయన గురించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలందరికీ 20 ఏళ్లుగా తెలుసన్నారు. ఎప్పుడైతే టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో అధికారంలోకి వచ్చాడో.. అప్పటి నుంచే చంద్రబాబు మాటలకు ష్యూరిటీ, గ్యారంటీలు లేవన్నారు. తాను టీడీపీలో ఉన్నప్పుడు చంద్రబాబు తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని చెప్పి.. చివరి వరకు ఇవ్వకుండా అనేక రకాలుగా మోసం చేసి, ఇబ్బందులు పెట్టాడన్నారు. అక్కడ ఉండలేక మాజీ సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి వైఎస్సార్‌పీపీలో చేరినట్లు తెలిపారు. రాష్ట్రం బాగుపడాలంటే జగన్ మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీని కోసం వైఎస్సార్‌సీపీ సైన్యం అంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉత్తర నియోజకవర్గంలో కె.కె.రాజుకు బాగా కష్టపడే నాయకుడిగా పేరుందని, దురదృష్టవశాత్తు రెండు సార్లు ఓటమి చెందారని, అయినా సరే వెనుకంజ వేయకుండా నిరంతరం పార్టీ కోసం కష్టపడుతున్నాడన్నారు. అటువంటి వ్యక్తిని ఈసారి ఎలాగైనా ఎమ్మెల్యేను చేసుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందని బాబూరావు పేర్కొన్నారు. అనంతరం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ స్కాన్ బ్యానర్‌ను పార్టీ నేతలంతా కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, వుడా మాజీ చైర్మన్ రవిరాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, నాయకులు సేనాపతి అప్పారావు, పేడాడ రమణికుమారి, బొగ్గు శ్రీను, మాజీ కార్పొరేటర్లు జి.వి.రమణి, పామేటి బాబ్జీ, దల్లి రామకృష్ణరెడ్డి, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, బలిరెడ్డి గోవింద్, సుకుమార్, ఐ.రవికుమార్, బల్లా శ్రీనివాస్, గుడ్ల అశోక్ రెడ్డి, బొడ్డేటి కిరణ్, భీశెట్టి ప్రసాద్, వేణు, రాష్ట్ర, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ డైరెక్టర్లు, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అమ్మ ఒడి'పై అన్నీ అబద్ధాలే...

పేద పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదనే సదుద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్ అమ్మ ఒడి పథకాన్ని రూపొందించి ప్రారంభిస్తే.. ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఈ పథకం తన సుపుత్రుడు లోకేష్ ఆలోచనని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకురావడం సిగ్గుచేటని కె.కె.రాజు ఎద్దేవా చేశారు. జనం ఏదైనా నమ్ముతారనే భావనతో చంద్రబాబు ఇలా అబద్ధాలు మాట్లాడుతున్నారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.


కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

క్లుప్తంగా

వైభవ వేంకటేశ్వరుడికి విశేష సేవలు


విశేష అలంకరణలో వైభవుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష సేవలు జరిగాయి. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాలుడి అదృశ్యం


శెట్టి అబ్రహం

మద్దిపాలెం: ఫోన్ చూస్తుండగా తండ్రి మందలించాడని మనస్థాపం చెందిన ఓ బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రామ్మూర్తిపంతులు పేట గవర కంచరపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న శెట్టి అబ్రహం పెందుర్తి ఐటీఐలో చదువుతున్నాడు. ఈ నెల 10న ఉదయం 10 గంటల సమయంలో సెల్‌ఫోన్ చూస్తుండగా తండ్రి మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లి ఇంతవరకూ తిరిగి రాలేదు. కొడుకు కోసం అంతటా గాలించినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి హరిదాసు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు

గాజువాక: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వివిధ ప్రయోజనాలు పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు అన్నారు. సోలార్ విద్యుత్ ప్రయోజనాలపై శ్రీనగర్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా బ్యాంకు నుంచి రూ.78 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈ పథకంలో బీసీలకు అదనంగా మరో రూ.20వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఈ పథకాన్ని పూర్తిగా ఉచితంగా పొందవచ్చన్నారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం వల్ల వినియోగదారుల విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జూనియర్ బాయ్స్ క్యాంప్ ప్రారంభం నేడు



తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో రాష్ట్ర ఫుట్‌బాల్ జూనియర్స్ క్యాంప్ ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ సూచనల మేరకు ఈ నెల 22 వరకు ఈ క్యాంప్ జరుగుతుందన్నారు. క్యాంప్ ముగిసిన అనంతరం ఈ జట్టు మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీలలో పాల్గొనుందన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


మాట్లాడుతున్న ఫాదర్ బాలశౌరీ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఫాదర్లు, సిస్టర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథడ్రల్ చర్చిలో ఆగస్టు 1 నుంచి జరిగే దేవమాత మోక్షారోపణ ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఆర్‌సీఎం విశాఖ ఆర్చి డయోసిస్, చర్చి విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ మైదానంలో జరిగిన ఈ పోటీలను జనరల్ రెవరెండ్ ఫాదర్ దగ్గుంపూడి బాలశౌరీ, రెవరెండ్ ఫాదర్ సరిన ప్రతాప్ ప్రారంభించారు. ముందుగా దేవమాత ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవాలను ఉద్దేశించి ముఖ్య సందేశం అందించారు. కార్యక్రమంలో జ్ఞానాపురం సహాయ విచారణకర్తలు, రెవరెండ్ ఫాదర్లు, విమల్ రాజ్, ప్రేమ్‌కుమార్, సిస్టర్ రోస్ మేరీ, జూబ్లీ ప్రిన్సిపాల్ ఆంథోనమ్మ, పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు, ఏఐసీయూ అధ్యక్షుడు బూర శేషుబాబు, విజయ్‌కుమార్, విక్రాంత్, తేజ, రాఖీ తదితరులు పాల్గొన్నారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటాలు


వర్ధంతి సభలో పాల్గొన్న సామాజిక కార్యకర్త భగత్‌సింగ్, వివిధ సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం: మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజా, దళిత, పౌర సంఘాల సమరశీల పోరాటాలు చేయాలని కారంచేడు ఉద్యమ సామాజిక కార్యకర్త భగత్‌సింగ్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కారంచేడు దళిత అమరవీరుల 40వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారంచేడులో 1985 జూలై 17న దళితుల నెత్తురు ఏరులై పారిందని, ఒక పథకం ప్రకారం చుట్టుపక్కల గ్రామాల కమ్మ భూస్వామ్య వర్గం అధికార మదంతో జరిపిన దాడిలో ఐదుగురు దళితులు అసువులు బాసారని, సుమారు 100 మందిని వెంటపడి తీవ్రంగా గాయపరచి, మహిళలపై అత్యాచారాలు చేశారని నాటి సంఘటనలను గుర్తుచేసారు. ఆనాటి ఉద్యమానికి, బాధిత దళితులకు దళిత సంఘాలు, అంబేడ్కర్ సంఘాలు, విప్లవ పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలిచాయన్నారు. న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వై.కొండయ్య మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు తమ అజెండాను శక్తివంతంగా అమలు చేసేందుకు ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించి, ప్రజాపోరాటాలను దెబ్బతీయగలిగే శక్తులను అన్వేషించాయని తెలిపారు. మన్మోహన్ సింగ్‌ని, కాంగ్రెస్‌ని పక్కన బెట్టి, మరోవైపు కాంగ్రెస్ హయాంలో దేశంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కార్పొరేట్ శక్తులు తమ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేశాయన్నారు. కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, న్యూ డెమోక్రసీ కార్యదర్శి ఎం.వేంకటేశ్వర్లు, ఏరియా కమిటీ నాయకులు కె.నిర్మల, భీం సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, దళిత విముక్తి కన్వీనర్ ఎస్.వి.రమణ, భారత నాస్తిక సమాజం జీడీ సారయ్య, ప్రజాపోరు ప్రతినిధి దేవా, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ముగ్గురు యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్


రుషికొండ బీచ్‌లో కాపాడిన యువకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ముగ్గురు యువకులు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డ్స్ ప్రాణాలు కాపాడిన సంఘటన చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన ఐదుగురు యువకులు శనివారం సాయంత్రం రుషికొండ బీచ్‌కు వచ్చారు. కాసేపు సరదాగా గడిపిన అనంతరం స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో బి.శ్రీనివాసరావు, ఎం.రామ్, ఎ.శివ కొట్టుకుని పోతుండటంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, ఎం.అమ్మోరు చిన్నప్పన్న, గురుమూర్తి, జి.దేవ గుర్తించారు. వారిని రక్షించి, తీరానికి తీసుకువచ్చారు. వారికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. లైఫ్‌గార్డ్స్ ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

వాల్తేర్ డివిజన్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో శనివారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహననాయుడు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరాతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో జరుగుతున్న పనులు, ప్రాజక్టులు, స్టేషన్ రీ డెవలప్‌మెంట్, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ అండర్ బ్రిడ్జిల పురోగతి గురించి మంత్రికి డీఆర్‌ఎం వివరించారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలో జరుగుతున్న అమృత్ భారత్ స్టేషన్ పనులు, పలు రైల్వే స్టేషన్లలో స్టాపేజీలు, రైళ్ల పొడిగింపు వంటి అంశాలను మంత్రి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేసినట్లు డీఆర్‌ఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. సమావేశంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారం(ఇన్‌ఫ్రా), ఇతర బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.

బుల్లయ్య కాలేజీలో నైపుణ్య శిక్షణకు సీఐటీడీ ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న బుల్లయ్య కాలేజీ ప్రిన్సిపాల్, సీఐటీడీ ప్రిన్సిపల్ డైరెక్టర్

మురళీనగర్: నగరంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్(అటానమస్) కాలేజీలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ) ముందుకు వచ్చింది. ఈ మేరకు శనివారం బుల్లయ్య కాలేజీ, సీఐటీడీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా సీఐటీడీ ప్రిన్సిపల్ డైరెక్టర్ విజయ్ కృష్ణకాంత్ మాట్లాడుతూ తమ సంస్థ కాలేజీల్లోని ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇండస్ట్రీ 4.0 అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. బుల్లయ్య కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ సమకాలీన సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యాపకులు అందిపుచ్చుకోవాలన్నారు. ఇంజినీరింగు కోర్సులు చేస్తున్న అన్ని బ్రాంచీల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా డిజైన్ కోర్సులైన ఆటోక్యాడ్, కెటియా, ప్రోయిా, సాలిడ్‌వర్క్స్, స్టాడ్ ప్రో, ఆటోమేషన్ కోర్సులు నిర్వహిస్తారని, ఈ మేరకు సీఐటీడీ, బుల్లయ్య కాలేజీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ చౌదరి, ఎంఎస్ఎంఈ అడ్వైజర్ కె.ఎన్.ఎస్.ప్రకాశరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా పాపాహోం రజతోత్సవం


కార్యక్రమం ప్రారంభిస్తున్న సీపీ బాగ్చి


సాంస్కృతిక ప్రదర్శనలో పాపాహోం పిల్లలు

డాబాగార్డెన్స్: పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ ప్రాంగణంలో నడుస్తున్న పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) 25వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్, పాపాహోమ్ చైర్మన్ శంఖబ్రత బాగ్చి, హోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పాపా హోం కమిటీ, విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. పాపాహోంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు బాగా చదువుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వివిధ కారణలచే నిరాదరణకు గురైన బాల బాలికలను చేరదీసి, వారిని బాగు చేస్తే మంచి భవిష్యత్ కలిగి చక్కగా జీవిస్తారని, తద్వారా స్థిరపడతారని తెలిపారు. 25 ఏళ్లుగా చక్కని ఆశయాలతో పాపాహోం అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులు, సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) డాక్టర్ అజిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ పాపాహోం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల తీరు ప్రశంసించారు. ఈ సందర్భంగా పాపాహోం పిల్లలచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాపా హోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో డాక్టర్ అస్లాం ఆరీఫ్, రాజగోపాలరాజు, ఉపాధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, విశాఖపట్నంలో

ఈ.పి. 31/2017 ఇన్ ఓ.ఎస్. 393/2013

బిట్వీన్
శ్రీ తేతలి రామారెడ్డి ...డీ.హెచ్.ఆర్.
అండ్
శ్రీ టంకసాల శేషగిరిరావు ...జే.డీ.ఆర్.

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పై కేసు నంబరు డిక్రీ అమలులో బాకీ రాబట్టే నిమిత్తము పైన ఉదహరించిన న్యాయస్థానంలో **తే॥ 04-08-2025దిన ఉదయం గం॥ 10.30 ని॥ల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యకాలంలో** కోర్టు వారు బహిరంగ వేలం వేయుదురు. కావున వేలంలో పాల్గొనదలచిన వారు ఆ సమయంలో వేలంలో పాల్గొనవచ్చని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

వేలం ఆస్తి వివరములు:

1) విశాఖపట్నం జిల్లా మహా విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, సీతమ్మపేట, రాజేంద్రనగర్, టౌన్ సర్వే నంబరు. 33/5, ప్లాట్ నంబరు 26లో, 395 చ॥గజములు స్థలములో నిర్మించబడిన శ్రీ లక్ష్మీ రెసిడెన్సీ-2, డోరు నంబరు. 50-16-14, ఫ్లాట్ నెం. ఎస్-2 (1070 చ॥ అడుగుల) 35 చ॥ గజముల షేర్ కలిగివున్న ఫ్లాట్‌కు **హద్దులు : తూర్పు:** ఓపెన్ స్పేస్, **పడమర:** స్టెయిర్‌కేసు అండ్ లాబీ, **దక్షిణం:** ఓపెన్ స్పేస్, **ఉత్తరం:** ఓపెన్ స్పేస్.

1) విశాఖపట్నం జిల్లా మహా విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, సీతమ్మపేట, రాజేంద్రనగర్, టౌన్ సర్వే నంబరు. 33/5, ప్లాట్ నంబరు 26లో, 395 చ॥గజములు స్థలములో నిర్మించబడిన శ్రీ లక్ష్మీ రెసిడెన్సీ-2కు **హద్దులు: తూర్పు:** ప్లాట్ నంబరు. 20, **పడమర:** 30 అడుగుల రోడ్డు, **దక్షిణం:** 30 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నంబరు. 25.

డీహెచ్‌ఆర్ విలువ: రూ. 10,00,000/- (పది లక్షల రూపాయలు మాత్రమే)
అమీనా విలువ: రూ. 20,00,000/- (ఇరువది లక్షల రూపాయలు మాత్రమే)
హియరింగ్ డేటు: తే॥ 04-08-2025ది

ఎస్.ఎస్.వి. రెడ్డి, అడ్వకేట్
వేణుమాధవి విల్లా, డోరు నెంబరు 49-36-47,
ఎన్.జి.జి.ఓస్ కాలనీ, అక్కయ్యపాలెం,
విశాఖపట్నం-530016. ఫోన్: 9393102036

భక్తులతో సింహగిరి కిటకిట


నీలాద్రిగుమ్మం వద్ద భక్తుల రద్దీ

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. రెండవ శనివారం సెలవురోజు కావడంతో పలుపాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గిరి ప్రదక్షిణరోజు 32 కిలోమీటర్లు ప్రదక్షిణ చేసి, సింహగిరిపైకి వెళ్లని పలువురు భక్తులు కూడా వచ్చారు. బస్సులు, అన్నప్రసాద భవనం కిటకిటలాడాయి.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.